డైమండ్ మార్క్..

డైమండ్ ఆకారంలో నిర్మించిన పార్కు కనుక ద్వారకానగర్‌లో ఉన్న పార్కుకు డైమండ్ పార్క్ అనే పేరొచ్చింది. నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఈ పార్కు ఎంతో ప్రత్యేకమైనది. పచ్చదనం పరిఢవిల్లే ఈ పార్కులో చిన్నాపెద్దా వ్యాయామాలు చేసుకోవడానికి ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి. పచ్చని చెట్లు ఈ పార్కుకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తుంటాయి. కార్మికులు, కూలీలు, తోపుడు బండ్ల వర్తకులు మధ్యాహ్నం వేళ ఇక్కడి సిమెంట్ చప్టాలపై చెట్ల నీడలో కూర్చుని భోజనాలు చేస్తుంటారు. విద్యార్థులు ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ కనిపిస్తారు. సర్వజన హితంగా పేరు పొందిన ఈ పార్కును జగనన్న సర్కార్ హయాంలో ఎన్నో హంగులతో ఆధునికీకరించారు.


వాకర్ల కోసం చక్కని వాకింగ్ ట్రాక్

- చక్కటి సదుపాయాలు.. అద్భుతమైన గ్రీనరీ
- వాకింగ్ ట్రాక్.. ఓపెన్ జిమ్
- అందరినీ ఆకట్టుకునేలా అన్నీ ఒక్కచోటే


ఆటపాటల్లో చిన్నారులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని ద్వారకానగర్ వద్ద గల డైమండ్ పార్కు నియోజకవర్గ ప్రజలతో పాటు ఎంతో మందికి ఆహ్లాదం పంచుతోంది. ఇక్కడి నాలుగు రోడ్ల కూడలిలో నిర్మించిన ఈ పార్కును 2009 నవంబర్‌లో అప్పటి మేయర్ పులుసు జనార్దనరావు హయాంలో ఆధునీకరించారు. నియోజకవర్గంలో వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు వచ్చే వరకు ఇదే ప్రధాన పార్కు కావడం విశేషం. ద్వారకానగర్, డైమండ్ పార్కు, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, అక్కయ్యపాలెం తదితర ప్రాంత ప్రజలు సాయంత్రం సేదదీరడానికి ఇక్కడికే వస్తుంటారు. పచ్చదనం నిండుగా ఉండటంతో ఇక్కడ సేదదీరేవారు మధురానుభూతికి లోనవుతారు. ఇక్కడ స్మార్ట్‌పోల్ కూడా ఏర్పాటు చేశారు. పార్కు నలుమూలలా సీసీ కెమెరాలు ఉన్నాయి. పార్కులో గల వాకింగ్ ట్రాక్‌లో సందర్శకులు నిత్యం వాకింగ్ చేస్తుంటారు.


డైమండ్ పార్క్ ప్రధాన ప్రవేశద్వారం

ఓపెన్ జిమ్...

స్మార్ట్‌సిటీలో భాగంగా జీవీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం డైమండ్ పార్కులో కూడా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో పిల్లలు, పెద్దలు ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామాలు చేస్తుంటారు.

భోజనాల వేదిక...

ఈ పార్కు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనాల వేదికగా కూడా మారిపోతుంటుంది. పార్కు చుట్టుపక్కల గల దుకాణాలు, షాపింగ్ మాల్స్, తోపుడు బండ్ల వ్యాపారులు, పని వాళ్లు ఇంటి నుంచి తెచ్చుకున్న క్యారేజీలతో ఇక్కడికొచ్చి భోజనాలు చేయడం ఆనవాయితీ. తోపుడు రిక్షాలు నడిపేవారు కూడా ఇక్కడే భోజనాలు చేస్తుంటారు. అలాగే పలు రకాల పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు కూడా ఇక్కడే పుస్తకాలతో కుస్తీ పడుతూ కనిపిస్తారు. రాత్రి బాగా పొద్దు పోయే వరకు అధిక సంఖ్యలో ప్రజలు ఇక్కడ సేదదీరుతుంటారు. చుట్టూ వాహనాల రాకపోకల సమయంలో కూడా పార్కులో ఎంచక్కా పచ్చదనం మధ్య సేదదీరడం విశేషం. విశాఖలో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అరుదైన పార్కుల్లో ఇదొకటి. పార్కులోకి సందర్శకుల రాకపోకల నిమిత్తం నాలుగు గేట్లు అందుబాటులో వున్నాయి.


గ్రూప్ డిస్కషన్స్ చేస్తున్న విద్యార్థులు

పార్కుకు నాలుగు ద్వారాలు..

నియోజకవర్గంలో పార్కుల సంఖ్య చాలా తక్కువ. దీంతో డైమండ్ పార్కులో సందర్శకుల సంఖ్య అధికంగా ఎంటుంది. ఇక్కడ ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అధిక సంఖ్యలో ప్రజలు సేదదీరుతుంటారు. పార్కును 2009లో ఆధునీకరించిన తర్వాత పలు సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పార్కుకు నాలుగు వైపులా ప్రవేశ ద్వారాలు ఉండటం వల్ల ఎటు నుంచి అయినా లోపలికి రావొచ్చు. – శ్రీనివాస్, ద్వారకానగర్.

చదువుల పార్కు..

డైమండ్ పార్కులో విద్యార్థుల సంఖ్య కూడా బాగానే పెరుగుతుంది. ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ మాదిరిగానే ఈ పార్కులో కూడా విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి పుస్తకాలు చదువుతుంటారు. గ్రూప్–1, గ్రూప్–2 వంటి పలు రకాల పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు డైమండ్ పార్కులో చదువుకోవడానికి వస్తుంటారు. పార్కులోని చెట్ల నీడలో వారు కూర్చుని చదువుకోవడం, డిస్కషన్స్ చేసుకోవడం, రాసుకోవడం వంటివి చేస్తుంటారు. – ఆనంద్, దొండపర్తి.

ధర్నా విజయవంతం చేయాలని పిలుపు



ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. సిటు కార్యాలయంలో గురువారం ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ ప్రభుత్వ రంగ సంస్థల్లో రెగ్యులర్ కార్మికుల సంఖ్య తగ్గుతుందని, వీరి స్థానంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. అయితే సంపద సృష్టిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏ విధమైన కార్మిక చట్టాలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి–సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పి. వెంకట్‌రెడ్డి, కేఎం కుమార మంగళం, పి. మణి, బి. జగన్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


గణేష్ నిమజ్జన యాత్రలో పాల్గొన్న కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారంతో ఉత్సవాలు ముగిశాయి. వినాయక నిమజ్జన యాత్ర వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా వినాయక లడ్డూని నిర్వాహకులు వేలం వేయగా రూ.15 వేలకు వైఎస్సార్‌సీపీ 33,34,41 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం సొంతం చేసుకున్నారు. అనంతరం మేళతాళాల మధ్య గణేష్ నిమజ్జన యాత్ర వైభవంగా చేపట్టారు. లడ్డూ ప్రసాదాన్ని అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీహెచ్‌కు 50 వీల్ చైర్ల వితరణ


వీల్ చైర్లు అందజేస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

మహారాణిపేట: కేజీహెచ్‌కు 50 వీల్ చైర్లను దివీస్ ల్యాబ్ అందించింది. రోగులు పడుతున్న అవస్థలను దివీస్ ఎండీ మురళి ప్రత్యక్షంగా చూశారు. దీంతో 50 వీల్ చైర్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైజాగ్ శాఖ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆర్ఎంవోలు డాక్టర్ మోహన్‌కుమార్, డాక్టర్ ధవళ భాస్కరరావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్ కుమార్, డి.శేఖర్ బాబు, పైడినాయుడు, సీనియర్ అసిస్టెంట్ సాంబమూర్తి నాయుడు పాల్గొన్నారు.

జెడ్సీగా మల్లయ్యనాయుడు



జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కమిషనర్‌గా ఎం.మల్లయ్యనాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ప్రసాదరావు బదిలీపై శ్రీకాకుళం వెళ్లారు. దీంతో ఇన్‌చార్జిగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోషికుమారికి బాధ్యతలు అప్పగించారు. గురువారం మల్లయ్యనాయుడు బాధ్యతలు స్వీకరించడంతో ఆమె బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ జోన్ స్థాయిలో పనులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ సిబ్బంది జెడ్సీకి స్వాగతం పలికారు.

దివ్యాంగుల కోసం యూనివర్సిటీ ఏర్పాటుకు వినతి


కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ సురేష్ మీనన్

మహారాణిపేట: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డాక్టర్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎం.సురేష్ మీనన్ కోరారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ వద్ద గురువారం కేంద్ర సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు దివ్యాంగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. రాష్ట్రంలోని దళితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు.

21న ఉచిత నేత్ర వైద్య శిబిరం


కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్: శంకర్ ఫౌండేషన్, రౌండ్ టేబుల్ ఇండియా సంయుక్తంగా ఈ నెల 21న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నాయి. స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ వేదికగా నిర్వహించనున్న శిబిరం పోస్టర్‌ను వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల చైర్మన్ మక్సూద్ అహ్మద్, పిల్లల వైద్య నిపుణుడు ముస్తాఫ్ అహ్మద్ గురువారం ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, శిబిరం క్యాంపు కో ఆర్డినేటర్ వై. రాజు, సంస్థ సభ్యుడు పైడిరాజు పాల్గొన్నారు.

గురజాడ జయంతికి ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: గురజాడ అప్పారావు 162వ జయంతి ఈ నెల 21న పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి గురువారం పోస్టర్‌ను వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ ఎస్. నాగేశ్వరరావు, సభ్యులు వై. అప్పారావు, ఫ్రాన్సిస్, ఎల్లాజీ, అబ్దుల్ అహ్మద్, అష్రాఫ్ పాల్గొన్నారు.

బాబు కన్నా.. జగన్ 100 శాతం మిన్న

- వంద రోజుల పాలనలో చంద్రబాబు ఫెయిల్
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్


జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన చూసిన ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కన్నా.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతో బాగుందన్న అభిప్రాయానికి వచ్చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. విజయవాడ తాడేపల్లిలో గల జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో వాసుపల్లి గురువారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తాను వైఎస్సార్‌సీపీలో చేరి నేటికి నాలుగేళ్లు పూర్తయిందని తెలిపారు. జగన్ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగిందని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలంటూ ఊరించి వంద రోజుల్లో ప్రజలను ఉసూరుమనిపించారని విచారం వ్యక్తం చేశారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అని ప్రకటించినా ఆచరణలో తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు కోడ్ అంటూ అమ్మఒడి పథకాన్ని అడ్డుకుని ఇప్పుడు తల్లికి వందనం అమలు చేయకుండా ప్రజాగ్రహం చవి చూస్తున్నారన్నారు. వంద రోజుల్లో కొత్త పెన్షన్, రైస్ కార్డులకు నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రం జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉద్యోగం లేదా రూ. 3 వేల నిరుద్యోగ భృతి, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు.. ఏ హామీ అమలు చేయలేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. లోకసత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ చెప్పినట్టు జగన్ మళ్లీ గెలవకుంటే ఏపీలో పథకాలు అమలు కావని నిరూపణ అయిందన్నారు.

ఆకతాయిల ఆగడాలు సాగనివ్వం


స్థానికులతో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు, కార్పొరేటర్ నాగరాజు

అల్లిపురం: ఆకతాయిల ఆగడాలపై ఉక్కుపాదం మోపుతామని టూటౌన్ సీఐ బి.తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలిసి వార్డులో చలువతోట, ఎల్లపువారివీధి, నేరెళ్లకోనేరు వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సీఐతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ వార్డులో అసాంఘిక కార్యక్రమాలకు తావుండదన్నారు. వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కందుల కృష్ణ, బుజ్జి, ఆదిబాబు, నాగేంద్ర, రమేష్ పాడి, గాజుల శ్రీను, చిట్టమ్మ, ప్రేమ్, కుమారి, కందుల కేదార్‌నాథ్, కందుల బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి


జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పులో పలు అంశాలపై న్యాయపర అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విశాఖ విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యా మల్లయ్య, కార్యదర్శి ఎస్. మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడు దాసరలి పుల్లారావు, మోరి గణేష్ తదితరులు గురువారం వినతిపత్రం ద్వారా కోరారు. ఇటీవల 125 మంది బీజేపీ ఎంపీలు క్రిమిలేయర్, ఇతర అంశాలపై సమీక్షించేందుకు కేంద్రం రివ్యూ పిటీషన్ వేయాలని కోరారని, అదే అంశాన్ని మరో సారి రామచంద్ర దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. తీర్పులో కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు తొలగించాలని కోరినట్టు చెప్పారు. వడ్డేపల్లి మాట్లాడుతూ ఎస్సీల పట్ల జరుగుతున్న అట్రాసిటీ యాక్ట్, ప్రభుత్వ రంగ విభాగాల్లో పదోన్నతులు, బ్యాక్‌లాగ్ పోస్టులు ఎంత వరకు అమలవుతున్నాయో జిల్లా సమీక్షలో చర్చించనున్నట్లు కమిషన్ సభ్యుడిని కలిసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ ప్రతినిధులు తెలిపారు.

బొలిశెట్టిపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

అల్లిపురం: ఉక్కు కార్మిక సంఘాల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధికార ప్రతినిధి బొలిశెట్టి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. బొలిశెట్టిపై చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఉక్కు కార్మిక సంఘాల నాయకులందరూ వెధవలని, దొంగలని, అమ్ముడుపోయారని, పవన్ కళ్యాణ్‌ని కలవాలంటే యువ కార్మికులు ముందు యూనియన్ నాయకులను చాచి పెట్టి కొట్టి అప్పుడు రండి అంటూ కార్మికుల మనోభావాలు దెబ్బతినేలా తూలనాడారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ చూపి అఖిలపక్ష రాజకీయ పార్టీలను, పోరాట కమిటీలను ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె. రెహమాన్, జేడీ నాయుడు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



సఫాయిమిత్ర పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

అల్లిపురం: స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛతాహీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సఫాయిమిత్ర సురక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ నిర్వహించిన సఫాయిమిత్ర సురక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా పరీక్షలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఎన్‌యూహెచ్ఎం కన్సల్టెంట్ శశిభూషణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు, సఫాయిమిత్ర కార్మికులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు


మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవిస్తే ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, యూపీహెచ్‌సీలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌వో అన్నారు. ప్రతి గర్భిణిని సంబంధిత యూపీహెచ్‌సీలో చూపించాల్సిన బాధ్యత సంబంధిత వైద్య ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, అగనంపూడి ఏరియా ఆసుపత్రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వె. మాధురి, డాక్టర్ వర్షిక, డాక్టర్ ఎస్.సి.బి. నాయుడు, జిల్లా మీడియా విస్తరణాధికారి ఎం.నాగేశ్వర రావు, డాక్టర్ రేవతి, డాక్టర్ జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



నేత్ర వైద్య శిబిరంలో డిప్యూటీ మేయర్ శ్రీధర్, కార్పొరేటర్ పూర్ణిమ తదితరులు

కంచరపాలెం: అధికారం ఉన్నా లేకున్నా ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తామని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని వైద్య శిబిరాలను ప్రారంభించారు. ముందుగా కార్పొరేటర్ పూర్ణిమ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కంటి పరీక్షలు, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం


సరకులు విజయవాడ పంపిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల యాజమాన్యం, సిబ్బంది రూ. లక్షా పాతిక వేలు విరాళం అందించారు. దీంతో బాధితులకు దుప్పట్లు, దోమతెరలు, కొనుగోలు చేసి విజయవాడ పంపించామని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ సుధ, పి.కె. విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఘనంగా అన్నసమారాధన


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


స్వామికి పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా స్థానిక యల్లమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని స్వామికి పూజలు జరిపారు. పెందుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో యాక్టింగ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి సత్యానంద్, వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్, స్థానిక కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, రవికుమార్, నవీన్‌కుమార్, గాయత్రి, సీహెచ్ రాజు, చరణ్‌రాజ్, యల్లమాంబ యువజన సేవా సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

ఆదిత్య గణపతికి ఘనంగా గరిక పూజ


గరికతో అలంకరించిన ఆదిత్య గణపతి

అల్లిపురం: నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం సాయంత్రం గణపతికి గరిక పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అసోసియేషన్ సభ్యులతో గరిక పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం


భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అల్లిపురం : దక్షిణ నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లను గురువారం సాయంత్రం ప్రారంభించారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని కేజీహెచ్, టర్నర్ చౌల్ట్రీ, ఫ్రూట్ మార్కెట్ వద్ద గల అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అనంతరం ప్రజలకు స్వయంగా వడ్డించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ పేదలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని రూ.5కే అందించడం గొప్ప విషయమన్నారు.